**కథ**

# సంఘర్షణ

**ఎ.రాజరాజేశ్వరి**

“ఏమండీ! మిమ్మల్నే..స్నానం అయిందా..లేదా..! ఏ సంగతీ చెపితే, టిఫిన్ పట్టుకొస్తాను” కిచెన్‌లోనుండీ శాంతమ్మ అరుస్తోంది.

రామ్మూర్తి బుర్రగోక్కున్నాడు. స్నానం చేసాడో లేదో ఎంతాలోచించినా గుర్తుకురావడం లేదు. తన మతిమరుపుకి రెండు తిడితే తిడుతుంది. ఆమెనే అడిగేస్తే పోలా...!

“ఇదుగో..శాంతా! నేను స్నానం చేసానో, లేదో గుర్తురావడం లేదు. పోనీ మళ్ళీ చేయమంటావా?” అన్నాడు వంటగదిలోకి తొంగి చూస్తూ.

“మీ మతిమరపుతో ఛస్తున్నాను. నీళ్ళు ఎప్పుడనగా కాచిపెట్టాను. తీసుకుని స్నానం చేయమన్నాను కదా!” అంది విసుక్కుంటూ.

“అవునుకదా! ఇందాకా ఆ పేపరుకాస్తా చదివేసి స్నానం చేద్దామనుకున్నాను. మరిచేపోయాను సుమీ! టిఫిన్ రెడీ చెయ్! అయిదు నిముషాల్లో వచ్చేస్తాను” అన్నాడు.

స్టౌమీద నీళ్ళగిన్నెను గుడ్డతో తీయబోయాడు. అవి చాలా చల్లగా ఉన్నాయి. అతడుకిసుక్కున నవ్వాడు.

“మతిమరపంటూ నన్ను వెక్కిరిస్తావుకానీ నువ్వసలు నీళ్ళు కాచనే లేదు. చాలా చల్లగా వున్నాయి. వీటితో స్నానం చేస్తే జలుబు చేస్తుంది”

శాంతమ్మ నీళ్ళవైపు చూసింది. తనసలు స్టౌ వెలిగించనే లేదు. నీళ్ళు చల్లగా వున్నాయి. ఏం చేస్తాం సావాసదోషం. ఒక్కయిదు నిముషాలు ఆగి రండి. నీళ్ళు కాగాక పిలుస్తాను” అని అతడిని పంపించి, కూరలు తరుగుతూ కూర్చుంది.

రామ్మూర్తికి ఆకలనిపించి వంటగదిలోకి వచ్చాడు. శాంతమ్మింకా కూర తరుగుతూనే వుంది. స్టౌమీద నీళ్ళు కుతకుతలాడుతున్నాయి.

అతడిని చూసి “అయ్యో! మిమ్మల్ని పిలవడమే మర్చిపోయాను. ఉండండి. నీళ్ళు బకెట్‌లో పోస్తాను” అని లేవబోయింది.

“నువ్వు పనిలో ఉన్నావుగా! ఫరవాలేదు. నేను పట్టుకెళ్తానులే!” అని రామ్మూర్తి బకెట్‌లో నీళ్ళు పోసి బాత్రూములోకి తీసుకెళ్ళాడు.

“ఇదుగో శాంతా! చన్నీళ్ళు రావడం లేదు కుళాయిలోనుంచీ కాస్త నీళ్ళిస్తావా!” అంటూ అరిచాడు.

‘ఇంకా నయం! మర్చిపోయి ఆ వేడినీళ్ళతో స్నానం చేయక, చన్నీళ్ళు అడిగాడీయన’ అనుకుంది. అతడికి నీళ్ళిచ్చి, ఇలా కూర్చుందో లేదో మళ్ళీ కేక.

“ఇదుగో! శాంతా! సబ్బు మర్చిపోయాను. కాస్త సబ్బిచ్చి వెళ్ళవా!”

శాంతమ్మ సణుక్కుంటూ లేచింది. “ఇదిగో సబ్బు. మీ మతిమరుపు కాదు కానీ, నన్ను గుంజిళ్ళు తీయిస్తున్నారు. ఈసారి ఏం కావలసి వచ్చినా, మీరే వచ్చి తీసుకోండి. కూరలు తరిగేవరకూ నేనింకోసారి లేచేది లేదు” అంది చిరుకోపంగా.

“ఇంక నిన్ను ఇబ్బంది పెట్టనులే! ఇప్పటికే రెండు సార్లు లేపించాను” అన్నాడు సానుభూతిగా.

“ఇలాటివి బాగానే గుర్తుంటాయి. అవసరమయిన విషయాలకి మాత్రం ఎక్కడలేని మతిమరపు” అని నవ్వుకుంది.

రామ్మూర్తి అక్కడున్న ఉత్తరాలు జేబులో వేసుకుని బయలుదేరాడు. వెళ్ళిన పది నిముషాలకు తిరిగొచ్చి, భార్య అందించిన మంచినీళ్ళు తాగుతూ అన్నాడు.

“నాకు మతిమరపంటూ వెక్కిరిస్తావుకదా! ఈసారి గుర్తుపెట్టుకొని డబ్బాలో వేసొచ్చాను” అని అంటూ తన చేతిలోని ఉత్తరాలు టేబులు మీద పెట్టాడు.

ఉత్తరాలు పోస్టు చేసేసానంటూనే వెనక్కి తీసుకొచ్చిన అతడి వైపు విస్తుపోతూ చూసింది. ఉత్తరాల బదులు పోస్టుడబ్బాలో ఏమేసి వచ్చాడు చెప్మా! అని అతడిని పరిశీలనగా చూసింది. చేతి వాచీ, కళ్ళజోడు అతడితోనే వున్నాయి. కొంపదీసి...సెల్‌ఫోను కానీ..డబ్బాలో ఉత్తరాల బదులు పడేసివచ్చాడా?

“సెల్ ఫోనేదీ? మీతో బయటకి తీసుకెళ్ళారా?” అంది గాబరాపడుతూ.

“స్టౌ దేనికి వెలిగించి వుంచావు? వంట కోసమా!” అని అడుగుతున్న భర్తవైపు చూసి, కెవ్వున అరిచింది. అతడు తడి ఒంటి నుండీ నీళ్ళు కారుతుంటే, దిగంబరంగా నిలుచుని వున్నాడు. శాంతమ్మ చటుక్కున టవల్ తెచ్చి, అతడిమీదకి విసిరింది.

“ఏమిటీ అవతారం! టవలు తెమ్మంటే ఇచ్చేదాన్ని కదా! టవలు లేకుండా వెళ్ళారా స్నానానికి” అంది గద్దిస్తూ.

“మరచిపోయాను శాంతా! నిన్ను మళ్ళీ పిలవద్దన్నావని నేనే వచ్చేసాను టవలు కోసం” అన్నాడు తన నడుముకి దాన్ని చుట్టుకుంటూ.

“ఇదుగో! ఉత్తరాలు పోస్టు చేస్తానన్నారు కదా! ఈ టిఫిన్ తిని, పోస్టు చేసి రండి” అంది ఉప్మా ప్లేటందిస్తూ. అందులో ఉప్పు లేదు. దాన్నలాగే మందు మింగినట్లుగా మింగేసాడు.

టిఫిన్ నోట్లో పెట్టుకున్న శాంతమ్మ చిన్నగా నుదురు కొట్టుకుంది. ‘ఈయనకి మతిమరపింతగా ముదిరిపోయింది. ఉప్మాలో ఉప్పుందో, లేదో కూడా పట్టించుకోరు, చెప్పరు’ అనుకుని రామ్మూర్తి ఏం చేస్తున్నాడోనని తొంగి చూసింది.

తనిప్పుడు దేనికి బయటికెళ్ళాలో, గుర్తురాక ఆలోచిస్తూ భార్య కనిపించగానే, “నన్ను బయటికెళ్ళమన్నావు దేనికి?” అన్నాడు.

“అదిగో! ఆ టేబులుమీద ఉత్తరాలున్నాయి. తొందరగా వెళ్ళి, పోస్టు చేసిరండి. అబ్బాయి ఈరోజు ఫోను చేస్తానన్నాడు. మళ్ళీ మిమ్మల్నడుగుతాడు” అని తొందర చేసింది.

కొడుకు ఫోను చేస్తాడనగానే ఉత్తరాలతోపాటు, అనాలోచితంగా సెల్‌ఫోను కూడా తనతో తీసుకెళ్ళి ఉత్తరాలకు బదులుగా ఫోను డబ్బాలో వేసొచ్చాడు.

బిక్క మొగమేసుకుని, “నువ్వన్నది నిజమే శాంతా!” అంటున్న అతడిమాటలకు అవాక్కయ్యింది. ఖరీదయిన ఫోనది. కొడుకు అమెరికానుండీ తీసుకొచ్చాడు. ఏ క్షణానయినా ఫోను చేసాడంటే, సంగతి తెలీక, ఫోనెత్తలేదని కంగారుపడతాడు.

“రండి పోస్టాఫీసు కెళదాం. ఎవరినయినా బ్రతిమాలుకుని ఆ డబ్బా తాళం తీయిద్దాం” అంది. ఇంటి తాళం కోసం వెతుకుతూ అది దొరకగానే ఇద్దరూ పోస్టాఫీసుకి వెళ్ళారు.

పోస్టుమాస్టర్‌కి జరిగినది చెప్పి, తామున్న ఏరియాలోకి ఎవరినయినా తమతో పంపించి లెటరు బాక్సు ఓపెన్ చేసి మా సెల్ ఫోను మాకు ఇప్పించండని రిక్వెస్టు చేసినా “ఉత్తరాలు తీసే టైమయిపోయింది. రేపు శెలవు కాబట్టీ, సోమవారం రండి” అన్నాడు.

పదిసార్లు బ్రతిమాలి, బామాలి కాళ్ళూ, గడ్డం పట్టుకుంటే, ఆఖరికి దయతలచి, వారితో మనిషిని పంపించాడు.

అప్పటికే బాక్సులోంచి సెల్ మోగుతోంది. ఓపెన్ చేయగానే ఏమాత్రం ఆలస్యం చేయక స్విచ్ఛాన్ చేసి, రోడ్డు మీదున్నాం పావుగంటాగి ఫోను చేయమంది.

తాళం తీసి లోపలి కడుగుపెట్టగానే ఇల్లంతా మాడు వాసన కమ్ముకుంది. సెల్‌ఫోను కోసం వెళ్ళే తొందరలో, శాంతమ్మ స్టవ్‌మీద కూర వదిలేసి, దాన్ని ఆఫ్ చేయకుం

డానే బయటి కెళ్ళిపోయారు. 'ఎప్పుడూ మతిమరపంటూ భర్తని ఆటపట్టిస్తుంది. ఏమిటో..ఈమధ్య ఆ జాఢ్యం తనకి కూడా అంటుకుంటోంది' అని గాఢంగా నిట్టూర్చింది.

కొడుకు చలపతి ఫోను చేయగానే, ఆరోజు తాము చేసిన ఘనకార్యాలు ఒకరి తర్వాత, ఒకరు కొడుకుతో చెప్పుకున్నారు.

చలపతి నిశ్శబ్దంగా విన్నాడు. "మేమంతా ఇండియా వస్తున్నాం. రెండు వారాలు శెలవు దొరికింది. మీ మనవలు, కోడలు కూడా మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు"

ఆ వార్త విన్న రామ్మూర్తి, శాంతమ్మలకు రోజులు గడవడమే కష్టమయిపోయింది. కొడుక్కి ఇష్టమయినవన్నీ గుర్తుచేసుకుని మరీ, డబ్బాల్లో చేసి పోసింది.

నానమ్మ, తాతయ్యల గురించీ వారి మతిమరపు చేష్టల గురించీ, తండ్రి తమతో తరచూ చెప్పి నవ్విస్తూ వుండడంతో పిల్లలిద్దరూ నానమ్మ దగ్గరికి ఉత్సాహంగా చేరారు. ఆవిడ మురిపెంగా దగ్గరికి తీసుకుంది.

"ఏమర్రా..స్వాతీ వాసూ..మా ఊరు నచ్చిందా.." అని అడుగుతున్న ఆవిడ ఒడిలో చేరి "తాతయ్య కథలు చెప్పునానమ్మా..అవి ఇంకా నచ్చుతాయ్"

అన్నారు గారంగా. ఆవిడ అర్థంకానట్లుగా కొడుకు వైపు ఏమిటన్నట్లు చూసింది.

"అదేనమ్మా! నాన్న మతిమరుపు చేష్టలు వినాలంటే వీళ్ళకి చాలా ఇష్టం. అవి చెప్పమంటున్నారు"

శాంతమ్మ కులాసాగా నవ్వింది. "అబ్బో! చాలా వున్నాయి తాతయ్య లీలలు. మొదట్లో ఇంత మరీ మరపు లేదు. రిటైరయ్యాకా పనిలేక ఖాళీగా వుండడంతో ఆయన బుర్ర కూడా రిటైరయిపోయింది. అప్పటి నుండే ఈ మతిమరపు!"

"ఒకరోజు ఆయన ఎక్కడ పెట్టానో గుర్తురావడం లేదని హడావిడిగా తెగ వెతుకుతుంటే మనసాగక అడిగాను ఏమిటి వెతుకుతున్నారని!"

"కళ్ళజోడు కనపడడం లేదు. అది లేకపోతే ఇబ్బంది పడాలి" అన్నారు ఇంకా వెతుకుతూ. ఇంకేముంది! ఆయనతోపాటుగా నేను కూడా పనులన్నీ పక్కన పడేసి రెండు గంటలపాటు ఇల్లంతా తెగ వెతికాను"

"ఇంతకీ ఎక్కడ దొరికింది? నానమ్మా.." అంది స్వాతి ఆతృతగా.

"ఇంకెక్కడ వుంటుంది. అది ఆయన కళ్ళకే వుంది. తను వెతికారని, ఆయనతోపాటు నేను కూడా..అదే పనిలోపడ్డాను."

అంతా గల గలా నవ్వడంతో రామ్మూర్తి ఉడుక్కున్నాడు.

"నా సంగతి సరే..మరి మీ నానమ్మ కథని కూడా వినండి. దీనికింకా నవ్వుతారు"

"ఒకసారి కళ్ళజోడు ఎక్కడ పెట్టానో దొరకడం లేదని ఈవిడ చాలా హడావిడి చేసింది. ఇద్దరం కలసి ఎంత వెతకినా దొరకనే లేదు. ఆరోజు వంటంతా ఉప్పు, కారాలు లేకనే ఎలాగో తంటాలుపడి చేసింది. రోజంతా వెతికినా దొరక్కపోవడంతో చెత్తతోపాటు బయటపడేసి వుంటుందని నిర్ణయించుకుని ఆ మర్నాడు కంటి డాక్టరు దగ్గరకి బయలుదేరాం"

"వెళ్ళేముందు నీళ్ళు తాగడానికి ఫ్రిజ్ దోరు తీసాను.



కూరలతోపాటు ఒక మూలకి ఆవిడ కళ్ళజోడు భద్రంగా వుంది. అది ఆవిడ చేతిలో పెట్టగానే నాలిక్కరుచుకుని, "అవునండోయ్! ఇప్పుడు గుర్తొస్తోంది. నిన్న ఫ్రిజ్ తీసినప్పుడు చేత్తోపట్టుకున్నాను దీన్ని. మరచిపోయి, కూరలతోపాటు దీన్నీ లోపల పెట్టేసాను" అంది.

ఆవిడ చేసిన పనికి విరగబడి నవ్వారు కాసేపు.

"ఇప్పుడు నువ్వు చెప్పు నానమ్మా..తాతయ్య గురించీ..." అంది స్వాతి.

శాంతమ్మ సాలోచనగా చూసి గుర్తుచేసుకున్నట్లుగా నవ్వి "మా చెల్లెలి కూతురి పెళ్ళి. మమ్మల్ని రమ్మని శుభ లేఖ పంపించారు. అందరినీ చూసినట్టూ వుంటుంది కాస్త మార్పుగానూ వుంటుంది అనుకొని ముందు నుంచే పకడ్బందీగా ప్లానేసుకుని, ఇంటి తాళాలు అవీ కరెక్టుగా వేసి, ఆటోలో స్టేషనుకి బయలుదేరాము. కూలీని పెట్టి, మా కంపార్టుమెంటు నెంబరు, రిజర్వేషను చార్టులో మా పేరు చూసి కూర్చున్నాము. ఈసారి ఏమీ మర్చిపోక జాగ్రత్తగానే బయలుదేరేమన్న సంతోషం కాస్తా, రైలెక్కిన పావుగంటకి ఆవిరయ్యింది."

"ఏం జరిగింది?" పిల్లలతోపాటు పెద్దల మొహంలో కూడా ఆతృత కనిపించింది.

"ఇంకేం జరగాలి. ఈయనగారు ప్రయాణపు ఏర్పాట్లు చక్కగా చేసి, నన్ను జాగ్రత్తగా రైల్లో కూలేసారు. కానీ, రిజర్వేషను టిక్కెట్లు మాత్రం ఇంట్లో మర్చిపోయారు. టి.సి. కాళ్ళావేళ్ళాపడి, డబుల్ ఛార్జీ పేచేసి, ఎలాగో బెర్తు సంపాదించాము. సాటి ప్రయాణీకులు కూడా మా వయసుని చూసి మాకే సపోర్టివ్వడంతో, ఎటువంటి పేచీలు లేకుండా మాకు బెర్తిచ్చాడు. ఒకటే బెర్తు దొరకడంతో ఇద్దరం ఎలాగో తంటాలు పడి పెళ్ళికి వెళ్ళాం"

చలపతి, అతడి భార్య అర్చన మొహామొహాలు చూసుకున్నారు. పిల్లలు చప్పట్లుకొడుతూ, భలే..భలే..అని నవ్వుతున్నారు.

రామ్మూర్తి మనవల ఉత్సాహం చూసి నవ్వేడు. "మీ నానమ్మ తక్కువ తిందా! కూరలు చెక్కు తీసి, అవి పారేయక, తరిగిన కూర పడేసి, చెక్కుని జాగ్రత్తపెట్టింది. ఇక ఆరోజు మాకు పచ్చడి మెతుకులే గతి!"

ఆ మాటలు విన్న చలపతి ఇక ఆగలేకపోయాడు.



"మిమ్మల్ని మాతోపాటు వచ్చి ఉండమని ఎన్నిసార్లు పిలిచినా, ఏదో ఒక మిషతో తప్పించుకుంటున్నారు. ఈ వయసులో, మీ మతిమరపుపనులతో ఎన్నాళ్ళిలా అవస్థలు పడతారు. మీ చేష్టలు విని కాసేపు నవ్వుకోవడానికి బాగానే వుంటుంది కానీ, ఒక్కోసారి శృతిమించిన మతిమరుపు ప్రమాదాలకు కూడా దారితీస్తుంది"

"ఈసారి అక్కడికి రామని తప్పించుకోవద్దు. మిమ్మల్ని తీసుకెళ్ళేందుకు ఏర్పాట్లు చేస్తా"

అర్చన కూడా అంగీకారంగా తలూపి, "ఇంకా ఎందుకిక్కడ ఉండడం. మీరొస్తే మాకూ, పిల్లలకూ కూడా బాగుంటుంది" అంది.

రామ్మూర్తి నిర్ణయం కోసం నిరీక్షించసాగారు ఏం చెప్తాడా..అని.

అతడు అందరినీ ఒకసారి పరికించి చూసి, "నేను కాదంటున్నానని తప్పుగా అర్థం చేసుకోవద్దు. మా జీవితాలు ఇలా అలవాటుపడిపోయాయి. మాకంటూ ఒక ఇల్లు, ఒకరికొకరం తోడుగా, నీడగా! ఏ చిన్న కష్టంకానీ, అవసరం కానీ వచ్చిందంటే ఆదుకోవడానికి సిద్ధపడే ఇరుగు-పొరుగులు వున్నారు.

మేము అక్కడికొస్తే మీరిద్దరూ ఆఫీసులకి, పిల్లలు స్కూలుకి వెళ్ళిపోతారు. సాయంత్రం అలసిసొలసి వచ్చిన మీరు ఎవరి పనుల్లో వాళ్ళు బిజీగా వుంటారు. మాకు హాయ్..బాయ్. చెప్పేవరకే మీ టైముని వినియోగించగలరు. ఇంట్లోనే ఇటువంటి వాతావరణం వుంటే, ఇక ఇరుగుపొరుగులతో సఖ్యత, స్నేహం ఎండమావులే! గగన కుసుమాలే.

"మీరు పిలిచారని మీ వెంట అమెరికా వచ్చినా, అక్కడి యాంత్రిక జీవితం, నిశ్శబ్ద వాతావరణం భరించే కన్నా, ఇక్కడే వుండి అయినవాళ్ళను తలచుకుంటూ, మళ్ళీ మీ రాకకోసం ఎదురుచూడడమే బాగుంటుంది.

అంతేకాదు. మేము ఇంత దూరాన వున్నామని, మా క్షేమం కోసం మీరు ఫోను చేసి మాట్లాడే ఆ కొన్ని నిముషాలు, మళ్ళీ మీ నుండీ ఫోను కాల్ వచ్చేవరకూ మాకు టానిక్‌లా పనిచేసి, నూతన శక్తినిస్తుంది"

రామ్మూర్తి మాటలు అక్షరసత్యాలు కనుక, చలపతి, అర్చన ఏమీ జవాబియ్యలేకపోయారు.

అయినా వాళ్ళిద్దరినీ, అలా ఒంటరిగా వదలి వెళ్ళిపోవడానికి వారికి మనసు రాలేదు. అమెరికాలో వున్నవారంతా, డాలర్ల మత్తులో సుఖపడిపోతున్నారు అని, తమని తీసుకెళ్ళి వుంచుకోలేదనీ బాధపడే పేరెంట్సు గురించీ విన్నారుకానీ, తమ సాధక, బాధకాలు ఆలోచించి, ఇక్కడే వుంటామనే సహృదయులు ఎంతమంది.

'వారినక్కడికి తీసుకెళ్ళడం కాదు. సాధ్యమయినంత తొందరలో తామే ఇక్కడికి వచ్చి, వీరికీ వయసులో తామున్నామనే ధైర్యాన్ని, అండని ఇవ్వాలి. తమకున్న క్వాలిఫికేషనుకి ఇండియాలో కూడా మంచి ఉద్యోగాలే వస్తాయి. ఇక వీరి గురించీ సంఘర్షణ వుండదు తనకి'

అతడా నిర్ణయం తీసుకున్నాకా మనస్ఫూర్తిగా నవ్వాడు. "సరే నాన్నా..మీ నిర్ణయాన్ని గౌరవిస్తాం. ప్రస్తుతానికి మేము వెళ్ళిపోయినా అతి త్వరలో మనమంతా కలిసుండాలనే నా పంతాన్ని వేరే విధంగా నెగ్గించుకుంటాను. అదేమిటో ఇప్పుడు చెప్పను. అంతవరకూ వెయిట్ అండ్ సీ" అన్నాడు అందరినీ సందిగ్ధంలోకి నెట్టుతూ.

* * *

## రైటర్ లారా

బాలీవుడ్‌లో హీరోయిన్ పాత్రలకి సరైన విధంగా రైటర్స్ రాయడం లేదంటూ తనే స్వయంగా ఓ సినిమా స్క్రిప్ట్‌ని రెడీ చేసుకుంటోందిట లారాదత్తా. అలాగని ఈ సినిమా పక్కా ఫెమినిజంతో నిండి వుండదని, హీరోతో సమానంగా ఈ పాత్ర వుంటుందని, ఆ వేషాన్ని తనే ధరిస్తున్నానని చెబుతోంది లారా. తను సొంతంగా ఇలా రాసుకుంటున్న సినిమా అయినా లారా కెరీర్‌ని ఓ మలుపు తిప్పుతుందేమో!